లోకేష్ పాదయాత్రలో ధనుంజయ్‌రావు, వంశీకృష్ణ

విశాలాంధ్ర-మంగళగిరి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 76వ రోజు ఆదివారం ఆదోని నుంచి కోసిగి రోడ్డు బాబుల్ దొడ్డి వరకు 14 కిలోమీటర్లు కొనసాగింది. ఈ పాదయాత్రలో మంగళగిరి తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయ్ రావు, తెలుగు యువత నాయకులు అవ్వరు వంశీకృష్ణ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: మండల పరిధిలోని పాత మల్లపాలెంలో పిడుగుపాటుకు ఇద్దరు రైతులు చనిపోయారు. ఆదివారం సాయంత్రం అకాల వర్షం బీభత్సం సృష్టించడంతో పిడుగులు వడగళ్ళు వాన కురిసింది. మిర్చి పంటను కాపాడుకోవటం కోసం రైతులు పొలంలో పట్టాలు కప్పటానికి వెళుచుండగా పిడుగు పడి ఇద్దరు రైతులు చాట్ల శ్యాంబాబు(50), కొరివి కృపాదానం (55) మరణించారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

విశాలాంధ్ర-తాడికొండ: వివిధ కేసులలో పట్టుబడిన 124 మద్యం బాటిల్స్‌ను తాడికొండ పోలీసులు బడేపురం కొండ వద్ద ఆదివారం ప్రొక్లైన్తో ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తుళ్లూరు డిఎస్పి పోతురాజు ఆదేశాల మేరకు మద్యం బాటిల్స్‌ను ధ్వంసం చేయటం జరిగింది. కార్యక్రమంలో సీఐ జి శ్రీనివాసరావు, ఎస్సై నాగార్జున, స్టేషన్ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

టీడీపీలోకి మునగపాటి

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి- శివాలయం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, ఆంధ్ర ప్రదేశ్ పద్మశాలీయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, వైసిపి నాయకుడు మునగపాటి వెంకటేశ్వరరావు యువనేత నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదోని నియోజకర్గం కుప్పగల్లు శివార్లలో భోజన విరామ సమయంలో మునగపాటి యువనేతను కలిశారు. పసుపు కండువా కప్పి మునగపాటిని యువనేత సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మునగపాటితో పాటు ఆయన కుమారుడు చినరాజా, సోదరుడు రమేష్ కూడా పార్టీలో చేరారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం, ప్రాపంచిక జ్ఞానం కలుగుతుందని ప్రతి ఒక్కరూ పుస్తక పఠ్నాన్ని అలవర్చుకోవాలని ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు కోరారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఆదివారం పెదనందిపాడు, శాఖ గ్రంథాలయం నందు పుస్తక ప్రదర్శనను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహన్ రావు మాట్లాడుతూ నేటి యువత సెల్ ఫోన్లు, టీవీలు, ఇంటర్నెట్, కంప్యూటర్ల మోజులో పడి పుస్తక పఠనం పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని, ఎంత సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన పుస్తకాలు మంచి నేస్తాలుగా ఉపయోగపడతాయని, ఖాళీ సమయాలలో పుస్తకాలు చదవడం వల్ల మానసిక వికాసంతో పాటు విజ్ఞానం కలుగుతుందని తెలిపారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వహకురాలు పగడాల సుభాషిని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, గుగ్గిలం సాయిబాబు, అన్నలదాసు విజయేంద్ర రావు, సుబ్బారావు, మంజుల, విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సెలూన్ చైర్ అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి: పట్టణంలోని 23వ వార్డు, మహానాడుకు చెందిన నాయీబ్రాహ్మణ సోదరుడు కింతాడ రవి గత కొన్ని సంవత్సరాల నుండి బార్బర్ షాప్ నిర్వహిస్తున్నారు. కింతాడ రవి తనకు సెలూన్ చైర్ అందజేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి పెట్టుకున్న అభ్యర్ధన మేరకు, వారి జీవనోపాదికి సాయంగా నిలిచేలా సెలూన్ చైర్‌ను పంపి, టీడీపీ నాయకులచే అందజేయించారు. కింతాడ రవికి సెలూన్ చైర్ అందజేసిన వారిలో తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి ధారాదాసు, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కాటం అంజిరెడ్డి, వార్డు అధ్యక్షులు సంకురాత్రి అశోక్, వార్డు ప్రధాన కార్యదర్శి ధరణికోట వీరాంజనేయులు, బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జెట్టిపోయిన వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి నవీన్ వినుకొండ, గోపి దేశి దొనకొండయ్య, సీనియర్ నాయకులు బెలుం అంకిరెడ్డి, దొడ్డిపాటి వెంకటేశ్వర్లు, దుర్గారావు , దుర్గారెడ్డి, బాలకాశి యాదవ్, నరేంద్ర రెడ్డి పిట్ట, సాయి, కింతాడ రవి, చెరుకూరి పెద్ద కాశయ్య తదితరులు ఉన్నారు.

సంక్షేమ పాలనకు ప్రజాశీర్వాదం



విశాలాంధ్ర-పెద కూరపాడు రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పాలన జరుగుతోందని.. ఆ పాలనకు ప్రజాశీర్వాదం అందుతోందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట మండల పరిధిలోని కోనూరులో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న పాలనలో అందుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. మహిళలను, చిన్నారులను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. సంక్షేమ పథకాల అమలులో ఏవైనా ఇబ్బందులన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి లేని పారదర్శక పాలన సాగుతోందని.. ప్రజలంతా జగనన్న పాలనపై అంతులేని నమ్మకాన్ని చూపిస్తున్నారన్నారు. ప్రతి గడపలో తనకు అందుతున్న అపూర్వ ఆదరణే దానికి సాక్ష్యమన్నారు. జగనన్న ఆశయాలను ఆచరణలో పెడుతున్న తన పాలనలో మేలు జరిగిందని నమ్మితే తనను ఆశీర్వదించమని అడుగుతున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మండలం వైసీపీ కన్వీనర్ చిలకా చంద్రయ్య జడ్పిటిసి సభ్యులు తుమ్మ విజయ ప్రతాపరెడ్డి, నెల్లూరు చంద్రబాబు, సాయి రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు సాంసంగ్, ఎంపీపీ రజనీ , కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి: సీపీఐ, సీపీఎం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: దేశాన్ని అప్పుల ఊబిలోకి నెడుతూ, కార్పొరేట్ వ్యాపార దిగ్గజాలకు కొమ్ముకాస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాలని, పోరాటాలకు సిద్ధం కావాలని గుంటూరు నగర సీపీఐ కార్యదర్శి కోట మల్యాద్రి, సీపీఎం నగర కార్యదర్శి నళినికాంత్ పిలుపునిచ్చారు. మోడీ హటావో-దేశ్ కి బచావో ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక వెంకటాద్రి పేట, నెహ్రూనగర్, బుచ్చయ్యతోట ప్రాంతాల్లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను, పోర్టులను అదాని, అంబానీలకు దారాదత్తం చేస్తున్నారని అన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను సవరణల పేరుతో కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. నల్లధనాన్ని వెలికి తీసి, ప్రతి పేదవానికి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షల రూపాయలు వేస్తామన్న డబ్బులు ఎందుకు వేయలేదో నరేంద్రమోడీ సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం, టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై పోరాడకుండా కేంద్ర బీజేపీ ప్రభుత్వంతో రాజీదోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చల్లా మరియదాసు, వెంకట రమణ, హనుమంతరావు, రామచంద్రుడు, నూతలపాటి వెంకటేశ్వరరావు, జంగాల చైతన్య, బీవీఆర్, జగన్నాథం, ముత్యాలరావు, శ్రీనివాస్, నికల్సన్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ శుభ్రం చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి: సాగునీరు తాగునీరు అవసరాలు తీరుస్తున్న గుంటూరు ఛానల్‌ను వారం రోజుల్లోగా బాగు చేయాలని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళగిరి మండలం కాజా గ్రామం వద్ద గుంటూరు ఛానల్‌లో పేరుకుపోయిన తూటికాడను, గుర్రపు డెక్కను జనసేన పార్టీ నాయకుడు కంకణాల శంకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులను జనసేన నియోజకవర్గ ఇన్చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు, కంకణాల శంకర్, శివ నాగేంద్రరావు, అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, మునగపాటి వెంకట మారుతిరావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ మూడు నియోజకవర్గాలకు విస్తరించి ఉన్న ఈ గుంటూరు ఛానల్ మొత్తం మురుగునీటితో కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నగరాలతో పాటు అనేక గ్రామాలకు ఈ నీటినే తాగునీరుగా వినియోగిస్తున్నారని తెలిపారు. కొన్ని వేల ఎకరాలు భూమి ఈ ఆయుకట్టు కింద సాగుతుందని చెప్పారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వెంటనే స్పందించి ఛానల్‌ను వారం రోజుల్లో బాగు చేయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గుంటూరు ఛానల్ పొడవునా జనసేన పార్టీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. జనసేన నాయకుడు కంకణాల శంకర్ మాట్లాడుతూ ఈ సమస్యపై పత్రికలు మీడియా ద్వారా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కానీ అధికారుల నుండి స్పందన రాకపోవడంతో తాను సొంతంగా డబ్బు ఖర్చు పెట్టి రెండు పొక్లన్లతో వంతెన వద్ద కొద్ది మేర గుర్రపు డెక్క, తూటి కాడ తొలగించామన్నారు. మురుగునీరు కూడా కలుషితమవుతుందని జీవాల కళేబరాలు కూడా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. జనసేన మంగళగిరి మండల పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించండి

విశాలాంధ్ర-తాడేపల్లి: ఉండవల్లి కొండ అక్రమ మైనింగ్ ద్వారా వేలకోట్ల అవినీతికి పాల్పడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, దుగ్గిరాల జడ్పీటీసీ భర్త ఎమ్మెల్యే అనుచరుడు దాసరి వీరయ్య నుంచి నాకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని ఉండవల్లి గ్రామానికి చెందిన టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రాయపూడి కిరణ్ తాడేపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ కంప్లైంట్ నమోదులో రాయపూడి కిరణ్ వెంట తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, టీడీపీ నాయకులు దొప్పలపూడి జ్యోతిబసు, తమ్మా శంకర రెడ్డి,రెంటపల్లి రాజేష్, కంభం సాయి చందు, అద్దంకి మురళీ, దాసరి కృష్ణ, మన్యం రవి, కోలంటిమహేశ్వరరావ, సనక బుజ్జి, మారుమాక రాజేష్, కుక్కమళ్ళ వేలంగిని, ఢీకొల్ చైతన్య, బత్తుల సురేష్, జాలాది కిరణ్, మహేష్, సునీల్, కోటయ్య, కూరపాటి సత్య, సంకూరు రవీంద్ర, తప్పెట్ల వంశీ, తప్పట్ల రాజు, తప్పట్ల అభి, కోలంటి అశోక్,యాదోను బాలు, ఉదయ్, దయాకర్, మణికంత తదితరులు ఉన్నారు.

మంచి పుస్తకం ఆనందాన్నిస్తుంది

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మంచి పుస్తకం ఆనందాన్నిస్తుందని, అలవాట్లను కూడా మారుస్తోందని పలువురు పుస్తక ప్రియులు పేర్కొన్నారు. మంచి స్నేహితుడిలా జీవితానికి మార్గనిర్దేశం చేస్తుందని, వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుతోందన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో తెలుగు పండితులు రాజన్న మాస్టర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పుస్తక ప్రియుల ఫోరం కన్వీనర్ మమత చంద్రశేఖర్ మాట్లాడుతూ పుస్తకం ఓ మంచి నేస్తమని, పుస్తకం చదవటంలో ఉన్న ఆనందం అనుభవించే వాళ్ళకే తెలుస్తోందన్నారు. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవటానికి దారి చూపెట్టే సాధనంగా పుస్తకం ఉపయోగపడుతోందని అన్నారు. ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ చదువు మెదడుకి మంచి వ్యాయామమని, జ్ఞాపకశక్తిని పెంపొందిస్తోందన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ సినిమాలు, టీవీ, ఇంటర్నెట్, మెబైల్ లాంటి ఆధునిక సాంకేతికత సాధనాలు అందుబాటులోకి వచ్చినా పుస్తక పఠనాన్ని ఇష్టపడే వారు గణనీయంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు ఎస్వీ సత్యన్నారాయణ, అంకమ్మరావు, చలమారెడ్డి, తదితరులు ఉన్నారు.

లెనిన్ ఆశయం అజేయం

విశాలాంధ్ర-తెనాలి: ప్రపంచంలోని అన్ని దేశాలు ఆయా దేశాల పరిస్థితులను బట్టి సోషలిస్టుల పంథాకు రావడం తప్పనిసరని, దృఢమైన విశ్వాసం కలిగించిన శ్రామిక జన నాయకుడు లెనిన్ అని వక్తలు నివాళులర్పించారు. మండల కేంద్రం కొల్లిపరలో సీపీఐ, యువజన సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో లెనిన్ జయంతిని సీపీఐ కార్యా లయ ప్రాంగణంలో నిర్వహించారు. సమావేశానికి సీపీఐ మండల కార్యదర్శి తుంగా బాల స్వామి అధ్యక్షత వహించారు. ఇస్కఫ్ నాయకులు బొల్లిముంత కృష్ణ లెనిన్ జీవిత విశేషాలను వివరించి నేడు యువత, కమ్యూనిస్టులు ఆయన బాటలో నడుచుకోవాలని హితవు పలికారు. నేడు ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకంగా నడుస్తున్నాయని వాటిని పారద్రోలేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అధ్యక్షత వహించిన బాలస్వామి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక మతోన్మాద బీజేపీని సాగనంపి కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోడీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా యువనాయకులు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. యువజన సమాఖ్య తెనాలి నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు స్వాగతం పలుకుతూ బడుగు బలహీన వర్గాలకు లెనిన్ సిద్ధాంతాలపై అవగాహన కల్పించాలని, రాబోయే రోజులలో వామపక్ష పార్టీల విజయం కోసం కృషి చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలు, సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

26న త్యాగ రాజస్వామి జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-తెనాలి: సద్గురు శ్రీత్యాగ రాజస్వామి 256వ జయంతి ఉత్సవాలు ఈ నెల 26వ తేదీన వేమూరు మండలం పెరవలి గ్రామంలో శ్రీ భక్త రామ దాసు సద్గురు శ్రీ త్యాగరాజ సంగీత మహోత్సవ సమాఖ్య పెరవలి ఆధ్వర్యంలో బుధవారం జరుగుతాయని వ్యవస్థాపకులు తాడేపల్లి లోకనాథ్ శర్మ ఆదివారం తెనాలిలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ ఉత్సవాలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయని అన్నారు. త్యాగరజ కీర్తనలను హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖ తదితర ప్రాంతాల నుండి సంగీత విద్వాంసులచే కచేరీలు జరుగుతాయని అన్నారు. సంగీత సాహిత్యాభిమానులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడ మృత్యుంజయ శాస్త్రి, తాడేపల్లి ఆంజనేయ శాస్త్రి, వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, తాడేపల్లి శ్రీధర్, జోశ్యులు శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల ప్రచారం

విశాలాంధ్ర - నకరికల్లు : మండలంలో ఆదివారం వామపక్షాల నాయకులు ప్రచారం నిర్వహించారు. సిపిఐ, సిపిఎం నాయకులు మండల కేంద్రమైన నకరికల్లుతో పాటు కండ్లకుంట, త్రిపురాపురం, చీమలమర్రి, గుండ్లపల్లి, చేజర్ల, కుంకలగుంట తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు కాసా రాంబాబు, తప్పట్ల పుల్లయ్య, వైదన వెంకట్, యువరాజు నారాయణ, సిపిఎం నాయకులు పెద్దిరాజు, నాగేశ్వరరావు, ఇశ్రాయేలు, వెంక్రటావు తదితరులు మాట్లాడారు. మోడీ హటావో దేశ్ కి బచావో నినాదంతో ప్రచారయాత్ర జరుగుతుందన్నారు. ఏప్రిల్ 14 నుండి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. దేశ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని వారు తెలియజేశారు.

భద్రయ్య మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: అచ్చంపేట మండలం పరిధిలోని వేల్పూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొన్నెకంటి భద్రయ్య ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక నాయకులు ద్వారా భద్రయ్య మృతి తెలుసుకున్న పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు, భద్రయ్య భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భద్రయ్య అకాల మరణం పార్టీకి తీరని లోటు అని వారి మరణం పట్ల సంతాపం తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని అన్నారు. నివాళులర్పించిన వారిలో అచ్చంపేట మండలం వైసీపీ కన్వీనర్ చిలకా చంద్రయ్య , తుమ్మ విజయ ప్రతాప్ రెడ్డి, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈద సాంబిరెడ్డి, నెల్లూరు చంద్రబాబు, సాయి, కంబాల వీరబాబు , అంబటి నారాయణ తదితరులు నివాళులర్పించారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ముఖ్య కార్యవర్గ సభ్యుల సమావేశం గుంటూరులోని జయ గ్రాండ్ హోటల్ నందు ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ నాయకులు, రాష్ట్ర ప్రతినిధులు, అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరైయ్యారు. అనంతరం ముఖ్య ఆల్ ఇండియా బంజార నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న గిరిజన కులాల జాబితాలో ఇతర కులాలైన బోయ, వాల్మీకి, బెంతో ఒరియా వంటి అభివృద్ధి చెంది ఉన్న మైదాన ప్రాంతాల వారిని గిరిజనుల జాబితాలో కలపాలనే ఉద్దేశం ఏమాత్రం సహించరానిదన్నారు. ప్రభుత్వం ఎన్నో సంవత్సరాలుగా బీసీ కులాల జాబితాలో ఉండే కొన్ని జాతుల వారిని గిరిజన కులాల జాబితాలో చేర్చాలన్న ఆలోచనతో జీఓ నెంబర్ 52 ద్వారా కమిషన్ వేసి...ఆ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆ నివేదికను అసెంబ్లీ నందు ఆమోదిస్తూ దానిని కేంద్ర ప్రభుత్వానికి పంపించడం అనేది చాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజనులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలుపై దృష్టి పెట్టకుండా గిరిజనుల విషయంలో ములిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు ఈ కొత్త రకం ప్రతిపాదనల ద్వారా ఇతర కులాల వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రతిపాదించి ముందుకు ముందుకు తీసుకెళ్లడం అనేది చాలా దుర్మార్గంతో కూడిన చర్య అని దుయ్యబట్టారు. ఈ సమావేశం నందు గుంటూరు, పల్నాడు జిల్లాలకు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సుగాలి వెంకటరమణ నాయక్, చక్రి నాయక్‌లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉన్న అన్ని జిల్లాల నుంచి ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సభ్యులు సుమారు 500 మంది సభ్యులు, బి. చిన్న స్వామి నాయక్, కే.రాములు నాయక్, దొరస్వామి నాయక్, లక్ష్మానాయక్ భూక్యలతో పాటు ఏ.ఐ.బి.ఎస్.ఎస్. నాయకులు జటావత్ రాంబాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామీణ పట్టణ వైద్యుల ఐక్యవేదిక సంక్షేమ సంఘం వార్షికోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గ్రామీణ పట్టణ వైద్యుల ఐక్యవేదిక సంక్షేమ సంఘం 16వ వార్షికోత్సవం శ్రీ బాలాజీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు నగరంలోని న్యూ హనుమాన్ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ బాలాజీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వైద్య బృందం, పట్టణ గ్రామీణ వైద్యుల ఐక్యవేదిక సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో నివసించే పేద ప్రజల ఆరోగ్యాలను పెంపొందించే విధంగా పట్టణ గ్రామీణ వైద్యులు ఎనలేని సేవ చేస్తున్నారని అభినందరించారు. శ్రీ బాలాజీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నందు అధునాతన పరికరాలతో అందించే వైద్య సేవలు గురించి పట్టణ గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించడం జరిగింది. గ్రామాలలో నివసించే పేద ప్రజలకు ఆర్ఎంపీ, పీఎంపీలు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం కోసం శ్రీ బాలాజీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌కు పంపించాలని కోరారు. అనంతరం శ్రీ బాలాజీ వైద్య బృందాన్ని, వివిధ జిల్లాల ఆర్ఎంపీ అండ్ పీఎంపీ వైద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ బాలాజీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ బి.చంద్రశేఖర్, డాక్టర్ కొర్నేలియస్ జొన్నకూటి, డాక్టర్ భార్గవ, డాక్టర్ కాశీ విశ్వనాథం, డాక్టర్ ఎం.నాగబాబు, గైనకాలజిస్ట్ డాక్టర్ సింధూర రేఖ, ఆర్ఎంపీ అండ్ పీఎంపీ పట్టణ గ్రామీణ విడుదల ఐక్యవేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షులు వి.గోవిందరాజులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గల్లా మురళీకృష్ణ మనోహర్, జి.సాంబశివరావు, రవి వీరప్రసాద్, వి. రాము, బి.శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్, బిల్లా వెంకటేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-పొన్నూరు: భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డుకు చెల్లించిన పైకం నుండి క్లైములు పరిష్కరించాలని, కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గం అధ్యక్షులు ఆరేటి రామారావు అన్నారు. పొన్నూరులో స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం వద్ద జరిగిన సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులను ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు కూడ ఆర్థిక సహాయం ఇవ్వలేదని, వారు ఆర్థికంగా అల్లాడి పోతున్నాయని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల డబ్బు 12వేల కోట్ల రూపాయలను వేరే పథకాలకు మళ్లించటంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 32వేల క్లైయింలు పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశానికి సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పగడాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. యూనియన్ ఉపాధ్యక్షులు గుంటూరు.ఏడుకొండలు, కోశాధికారి సూరిబాబు, బుజ్జి, అంజి రెడ్డి, కాంతారావు, శివ కృష్ణ శ్రీను, శేష తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు ప్రాధాన్యాంశంగా పరిగణించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యాంశంగా పరిగణించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ)జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా విమర్శించారు. ఈ మేరకు గుంటూరు మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఏపీ జీఈఏ జిల్లా కార్యాలయం నందు ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను ప్రాధాన్యాంశంగా తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల సమస్యలుపై మంత్రివర్గ ఉప సంఘంతో చర్చించి ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం నేటి వరకు డీఏ కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జీఈఏ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ బాబు, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, నగరశాఖ అధ్యక్షులు రత్తయ్య, హుస్సేన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గోండు మహిళలకు వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్ పి.రాజశేఖర్ మాతృమూర్తి పట్టేటి లూర్థమ్మ జ్ఞాపకార్థంగా స్థానిక పెదకాకానిలో ఉన్న గోండు పేద మహిళలకు ప్రొఫెసర్ వెంకటరత్నం, పెదకాకాని సర్పంచ్ స్వరూపారాణి, వికాస అధ్యక్షులు అనిల్, డాక్టర్ ఆరిఫ్ చేతుల మీదుగా వస్త్రాలు పంపిణీ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటరత్నం మాట్లాడుతూ లూర్థమ్మ ఎంతో కష్టపడి చదువుకుని టీచర్‌గా మంచి పేరు తెచ్చుకొని గొప్ప మేధావులకు జన్మనిచ్చిన మాతృమూర్తి అని కొనియాడారు. అలాగే స్కోప్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. ఏఎన్‌యూ వికాస ప్రెసిడెంట్ టి.అనిల్ కుమార్ మాట్లాడుతూ మాతృమూర్తి లూర్థమ్మ జ్ఞాపకార్థంగా వస్త్రాల పంపిణీ కార్యక్రమానికి రావటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ దేవరపల్లి కొండలరావు (డీకె)మాట్లాడుతూ విద్యార్థి లోకానికి ఆరాధ్య దైవం లూర్థమ్మ అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, డాక్టర్ వేణు, అక్కారావు, రాజ్ కుమార్, డానియల్ పాస్టర్, పేతురు తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు పంపిణీ

విశాలాంధ్ర-దుగ్గిరాల: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో స్వయం ఉపాధి పథకంలో భాగంగా మండల కేంద్రమైన దుగ్గిరాలలోని టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత సమక్షంలో ఆదివారం తోపుడు బండ్లు, ఇస్త్రీ బండి, రిక్షా, సెలూన్ చైర్, టిఫిన్ బండి, వెల్డింగ్ మిషన్ లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దుగ్గిరాల గ్రామానికి చెందిన కొండూరు హణుమంతురావుకి ఇస్త్రీ బండి, మోరంపూడి గ్రామానికి చెందిన గరికపూడి రహేలు కి టిఫిన్ బండి, మంచికలపూడి గ్రామానికి చెందిన యార్లగడ్డ చలమయ్యకి రిక్షా సైకిల్,రేవేంద్రపాడు గ్రామానికి చెందిన బాషా కి వెల్డింగ్ మిషన్, ఈమని చెందిన నడింపల్లి రాజ్యలక్ష్మీ, కీర్తి తిరపతమ్మలకు తోపుడు బండ్లను, పెదకొండూరు గ్రామానికి చెందిన మల్లెల సుబ్బారావు కు తోపుడు బండి, కంఠం రాజు కొండూరు గ్రామానికి చెందిన బల్లపల్లి గోపికి సెలూన్ చైర్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఆరోగ్య విషయంలో ఆహారపు అలవాట్లే కీలకం

ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఆర్ లోకేష్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మన ఆహారపు అలవాట్లు మన ఆరోగ్య విషయంలో ప్రముఖ పాత్ర వహిస్తాయని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఆర్ లోకేష్ అన్నారు. ఆదివారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ మన అనారోగ్యానికి నేటి ఆహారపు అలవాట్లు, కలుషిత వాతావరణం, వ్యాయామం లేకపోవడం, బాగా మరిగిన నూనెను పదేపదే వినియోగించడం, సరైన నిద్ర లేకపోవడం, మానసిక ఒత్తిడి తదితర కారణాలని పేర్కొన్నారు. రోజుకు కనీసం 7గంటలు నిద్ర, మంచి పోషకాహారం, రోజుకు ఒక అరగంట వాకింగ్, మంచి ఆహ్లాదకరమైన వాతావరణం మన చుట్టూ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పిల్లలు రోజుకు కనీసం 3లీటర్లు, పెద్దలు కనీసం 4లీటలర్లు వాటరు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదన్నారు. కొన్ని వ్యాధులు జన్యుపరంగా వస్తాయని, మనం వ్యాధికి చికిత్స చేయించుకోవడం ఎంత ముఖ్యమో..వ్యాధి నిర్ధారణ చేసే డాక్టర్‌ను ఎంచుకోవడం కూడా అంతే ముఖ్యమని సూచించారు. గ్యాస్ సమస్య అనిపించినప్పుడు నామమాత్రపు మందులు వేసుకున్నా తగ్గకా రెండు రోజులకు మించి ఉంటే గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్‌ను సంప్రదించాలని కోరారు. మధుమేహ వ్యాధి ఉన్నవారు వారి రక్తంలో చక్కెర శాతాన్ని అదుపులో ఉంచుకోవడం మంచిదని, లేకుంటే అది ఇతర అనారోగ్య సమస్యలు త్వరగా రావడానికి దోహదపడుతుందన్నారు. బీపీ అనేది మన గుండె పంపింగ్‌ను బట్టి ఉంటుందని, అది 140/80 మించకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్ సలహా లేకుండా అనవసరంగా గ్యాస్ మాత్రలు వాడటం మంచిది కాదన్నారు. ఈ సమావేశానికి టీవీ సాయిరాం అధ్యక్షత వహించగా ఎస్వీ సత్యనారాయణ, కె.చంద్రశేఖర్ అవగాహన సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీగా శానంపూడి

విశాలాంధ్ర-శావల్యాపురం: పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం చేపట్టిన ఉత్తమ గ్రామపంచాయతీల ఎంపికలలో శావల్యాపురం మండలంలోని శానంపూడి గ్రామాన్ని ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక చేసినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం, మౌళిక వసతులు తదితర అంశాలలో మెరుగైన ప్రదర్శన కనబరిచినందుకు గాను శానంపూడిని ఉత్తమ గ్రామపంచాయతీగా ప్రభుత్వం ఎంపిక చేసిందని తెలిపారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి తనిఖీ

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఉదయం స్థానిక లింగంగుంట్ల వద్ద ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిను ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలు గురించి డాక్టర్లను నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆస్పత్రిలో ఉన్న పేషంట్లతో మాట్లాడి సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా, నర్సులు డాక్టర్లు బాగా స్పందిస్తున్నారా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసి డాక్టర్లు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకివ్వవలసిన గొప్ప ఆస్తి పుస్తకం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: వేలూరు గ్రామంలోని గుర్రం జాషువా గ్రంథాలయంలో ఆదివారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవ కార్యక్రమం జరిగింది. అతిథులుగా మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు, జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు హాజరై మాట్లాడారు. పెద్దలు పిల్లలకివ్వవలసిన గొప్ప ఆస్తి పుస్తకం అన్నారు. పిల్లల పుట్టిన రోజు కానుకగా పుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనవిజ్ఞాన వేదిక ప్రచురణల పుస్తకాలతో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం 100పుస్తకాలను గుర్రం జాషువా గ్రంథాలయానికి బహుకరించారు. గార్డ్స్ సంస్థ ఉపాధ్యక్షులు గేరా జాకోబు, కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, సభ్యులు షేక్ బాజి, ఉదయ్, గ్రామ సర్పంచ్ బొంత తిరుపతయ్య జాషువా గ్రంథాలయ కమిటీ సభ్యులు బొంత రమేష్, అశోక్, నాగేశ్వరావు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

విద్యార్థులకు సత్కారం

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక కొత్తపేటలో గల కృష్ణవేణి జూనియర్ కళాశాలలో సాయిరాం ఇంగ్లీష్ మీడియం స్కూల్ వారు నిర్వహించిన జవహర్ నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు 168 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఈ పరీక్ష పోటీలలో 100 మార్కులకు గాను 96.25 మార్కులు ముగ్గురు విద్యార్థులు సాధించారు. కుక్కల రాజశ్రీ , కావలి సురేంద్ర జోయల్, కట్టా సాత్విక్ వర్మ లతో పాటుగా అత్యధిక మార్కులు సాధించిన మరో 6 గురు విద్యార్థులకు సాయిరాం స్కూల్ డైరెక్టర్ ప్రైజ్ మనీ తో పాటు మెడల్స్ తో సత్కరించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను డైరెక్టర్ చంద్ర ముప్పాళ్ళ అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల డైరెక్టర్లు మరియు సిబ్బంది , హర్ష ,భాష్యం ఇంగ్లీష్ మీడియం పాఠశాలల కరస్పాండెంట్ పోకూరి శ్రీనివాసరావు, విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేసవిలో దాహార్తి తీర్చేందుకే ...

విశాలాంధ్ర-రెంటచింతల: అధిక ఉష్ణోగ్రత కేంద్ర బిందువైన రెంటచింతలలో ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి విజయ కుమార్ అన్నారు. ఆదివారం రెంటచింతలలో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి ఏటా మజ్జిగ, మంచినీరు దాతల సహకారంతో అందిస్తున్న మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో పూర్ణయ్య, బుట్టి మరియదాసు, ఉమా భారతి తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో పాల్గొనాలి

విశాలాంధ్ర-వినుకొండ: విజయవాడలో ఈనెల 24న జరగనున్న జై భారత్ సత్యాగ్రహ దీక్షలో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొని రాహుల్ గాంధీకి సంఘీభావం ప్రకటించాలని వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ కె నాయుడు ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో పిలుపునిచ్చారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుచరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలియజేశారు, రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పని చేయాలని, జై భారత్ సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన మిషనరీలు

విశాలాంధ్ర-వినుకొండ: ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్టు చర్చి ఆదివారం ఆరాధన మిషనరీలు కట్టించిన మిస్సమ్మ బంగ్లా నందు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం పాస్టర్ పత్రా, ఫిలిప్ సంఘకాపరి ఆరాధన జరిపించగా, సంఘ అధ్యక్షులు పందుల సాల్మన్రాజు మిషనరీల ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడుకు కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు, సంఘస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సంఘ పెద్దలు బేతం శ్యామ్ ప్రసాద్, బేతం గాబ్రియల్ మోజస్, జడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, పందుల ఫిలిప్, సురభి. జోసెఫ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం. గాబ్రియల్, గద్దల. ప్రేమ్ నాథ్ ప్రకాష్, గద్దల ఆశి వరప్రసాద్ వందనం, కమిటీ సెక్రటరి మన్నేపల్లి. శామ్యూల్, వైస్ సెక్రటరీ కట్టెంపూడి నాగేశ్వరరావు, ట్రెజరర్ పాలిపోగు డానియల్ ఇతర సంఘ పెద్దలు, సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సిలువ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

విశాలాంధ్ర-శావల్యాపురం: ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని శానంపూడి, ఇర్లపాడు గ్రామాలలోని కూలీలకు తక్కువ వేతనాలు జమయ్యేలా పనిచేయించినందుకు గాను టెక్నికల్ అసిస్టెంట్ సుబ్బారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు గోపీరాజు, నాగులుకు డ్వామా పీడీ గంగవరపు జోసపుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశాలలో సరైన పర్యవేక్షణ చేయకుండా విధుల పట్ల అలసత్వం వహించడం, పని పట్ల కూలీలకు సరైన అవగాహన కల్పించకపోవడంతో కూలీలకు రూ.200లోపే వేతనాలు జమయ్యాయని, పని ప్రదేశంలో సక్రమంగా కొలతలు నమోదు చేయలేదన్న కారణంగా షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, సరైన వివరణ ఇవ్వకపోతే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మతోన్మాద బీజేపీని గద్దెదించుదాం..

సీపీఐ, సీపీఎం

విశాలాంధ్ర-మాచర్ల: మతోన్మాద బీజేపీని గద్దె దించేవరకూ వరకు ప్రజలు, ప్రజాసంఘాలు, కార్మికులు సైనికుల్లా పోరాడాలని సీపీఐ పల్నాడు జిల్లా సెక్రటరీ మారుతీవరప్రసాదరావు, సీపీఎం పల్నాడు జిల్లా సెక్రటరీ గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరిలో భాగంగా ఆదివారం పట్టణంలోని పార్క్ సెంటర్లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులైన అదాని, అంబానీలకు దోచి పెట్టేలా ప్రధాని నరేంద్ర మోడీ పాలన దుర్మార్గంగా మారిందన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజా సంక్షేమాన్ని మరిచిందన్నారు. సంస్కరణల పేరుతో దేశాన్ని అభివృద్ధి చేస్తానంటూ చెబుతూనే, లక్షలాదిమంది ప్రజలకు ఉపాధి కల్పించే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణకు పాల్పడటం సహించరానిదన్నారు. దేశంలో ఎన్నో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి చూపించాల్సిన ప్రధాని మోడీ, ఉన్న పరిశ్రమలను తన దత్తపుత్రులైన అదాని, అంబానీలకు కట్టబెట్టడంలో అర్థం లేదన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను సవరణల పేరుతో కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలను సైతం, నల్ల చట్టాలను తెచ్చి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడం అంతకన్నా దుర్మార్గం మరొకటి లేదన్నారు. నల్లధనాన్ని వెలికి తీసి, ప్రతి పేదవానికి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న డబ్బులు ఎందుకు వేయలేదో సమాధానం చెప్పాలన్నారు. ప్రధాని మోడీ దుర్మార్గమైన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు అంగీకరిస్తున్నాయో తెలియటం లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టులపై ఎందుకు బీజేపీ నోరు మెదపటం లేదో చెప్పాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా సెక్రటరీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఢిల్లీని తలదన్నే రాజధానిగా, అమరావతికి ఇస్తామన్న నిధులు ఎక్కడా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో డీజిల్, పెట్రోల్, నిత్యవసర సరుకులు, అన్నిరకాల పన్నులు, చార్జీలు విపరీతంగా పెరిగి పేద, మధ్యతరగతి కుటుంబాలకు జీవనం కష్టపరంగా మారిందన్నారు. దేశంలో ప్రజా సంక్షేమం కరువై, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేలా ప్రజలు, ప్రజా సంఘాలు, రైతులు, కార్మికులు ఏకమై రానున్న ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలన్నారు. మోడీ దుర్మార్గమైన పాలనను ప్రజలకు వివరించేందుకు ఈనెల 30 వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రచారభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు భారీగా పాల్గొనాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు నాయక్, డివిజన్ నాయకులు బండ్ల మహేష్, లక్ష్మయ్య, సీపీఐ మాచర్ల, దుర్గి, కారంపూడి, రెంటచింతల సెక్రటరీలు మిద్దెపోగు బాబురావు, శివయ్య, షేక్ సైదా, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి బహిరంగసభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మతోన్మాద బీజేపీని సాగనంపుదాం-దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో సీపీఐ, సీపీఎంల ప్రచారభేరి ముగింపులో భాగంగా ఈ నెల 24వ తేదీ సాయంత్రం పాదయాత్ర, 25వ తేదీ సాయంత్రం కళామందిర్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు సుబ్బాయమ్మ, సీపీఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు అనేకమంది త్యాగధనులు బ్రిటిష్ వలస పాలనను ఎదిరించి తరిమి కొట్టి మనకు స్వాతంత్ర్యం తెచ్చారని, నేడు అదే స్వాతంత్ర్యం పెను ప్రమాదంలో పడిందన్నారు. దానిని కాపాడుకోడానికి మనం ఆనాటి జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్ళీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని వివరించారు. పేదలకు, సామాన్య ప్రజలకు అండగా ఉండడం పోయి వారిమీదే మోయలేనంత భారాలను మోపుతున్నారని, నిత్యావసర ధరలు, గ్యాస్ పెట్రో ధరలు పెరిగి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ నిరంకుశంగా అణచివేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతీ వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలన్నారు. 25వతేదీ సాయంత్రం 5గంటలకు కళామందిర్ సెంటర్‌లో నిర్వ హించే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య, పల్నాడు జల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్, సీపీఎం పల్నాడు జిల్లా కార్యవర్గ దర్శి సభ్యులు వై.రాధాకృష్ణమూర్తి పాల్గొంటారని వివరించారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఆయా పార్టీల నాయకులు నాయుడు శివకుమార్, విల్సన్, బి.భగత్‌సింగ్, సాతులూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు ఇచ్చి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర-నూజెండ్ల: రైతులకు ప్రభుత్వం సాగునీరు వెంటనే అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. మండలంలోని పమిడిపాడు బ్రాంచ్ కెనాలపై ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తా రోకో నిర్వహించారు. నాగార్జు నసాగర్ కుడి కాలువ జోన్ 2 పరిధిలో పామిడిపాడు బ్రాంచ్ కెనాల్ పరిధిలో వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న అనేక పంటలు నీళ్లు లేక ఎండిపోతున్నాయని అక్కడ రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఉలవలపూడి రాము మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులకు సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల మొక్కజొన్న రైతులు పంటలు వేసినప్పటినుంచి తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఏపీ ప్రభుత్వం ఏప్రిల్ మాసం చివర వరకు నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా సాగు నీరుస్తామని రైతులు తమకు నచ్చిన పంటలను సాగు చేసుకోవాలని పత్రికల ద్వారా తెలియజేశారన్నారు. ప్రభుత్వాన్ని నమ్మి రైతులు దాళ్వా వరి, మొక్కజొన్న, పెసర, కూరగాయలు, అనేక వాణిజ్య పంటలను సాగు చేశారని అయితే ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పి ఏప్రిల్ మాసం ఒకటో తేదీనే కుడి కాలువ కట్టేయడం జరిగిందని పల్నాడు జిల్లాలో అనేక ప్రాంతాల్లో రైతులు రైతు సంఘాలు జాతీయ రహదారుల పైకి వచ్చి నిరసన తెలియజేయడంతో ప్రభుత్వం నీళ్లు ఇస్తున్నామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఆ నీరు 57వ మైలు వరకు మాత్రమే వస్తున్నాయి. వినుకొండ నియోజకవర్గంలో 30 వేల ఎకరాలపైగా నీళ్లు లేక పైర్లు ఎండిపోతున్నాయని ఒకటి లేదా రెండు తడులకు నీళ్లు ఇప్పించాలని పల్నాడు జిల్లాకలెక్టర్‌కి వినతి పత్రాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. కలెక్టర్ పరిశీలించి నీళ్లు ఇప్పిస్తానని చెప్పడం జరిగింది. అయితే పంటలు ఎండిపోతున్నాయి. రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో గత్యంతరం లేక ఈ రోజు రాస్తారోకోని నిర్వహించామని, ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎస్సీతో ఫోన్ చేసి మాట్లాడగా ఆమె మాట్లాడుతూ మనకు 11వేల క్యూసెక్కులు నీరు రావాల్సి ఉండగా కేవలం 4500 మాత్రమే వస్తున్నాయని దాన్ని అందరికీ ఇబ్బంది లేకుండా చూస్తున్నానని రెండు రోజులు సమయాన్ని ఇవ్వండి మీకు కూడా ఇబ్బంది లేకుండా చూస్తానని ఎస్సీ చెప్పగా రాస్తారో కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమానికి అప్పరాజు పవన్ కుమార్, నూజెండ్ల మండల సీపీఐ కార్యదర్శి అధ్యక్షత వహించారు. రైతు నాయకులు నర్రా గురవయ్య, పి. చిరంజీవి, కట్టా నారయ్య, కే.సాయిరెడ్డి, వెంకట్రావు, గంగిరెడ్డి, కాసుల శ్రీను, ఎం శివ, బొట్ల అంజిబాబు, నాగ ప్రసాదు, శ్రీను, మందపాటి మురళి, రైతులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపుదాం

విశాలాంధ్ర-సత్తెనపల్లి: ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం-దేశాన్ని కాపాడుకుందాం... అనే నినాదంతో సిపిఐ-సిపిఎం సత్తెనపల్లి కమిటీల ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికి సిపిఐ-సిపియం కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేస్తూ శనివారం సాయంత్రం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల, ప్రైవేటీకరణ విధానాలు తిప్పికొట్టాలని, రాజ్యాంగ, ప్రజాస్వామిక హక్కులను కాపాడాలి. ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం నిర్మాణంపై కేంద్ర మంత్రి ప్రభుత్వం ద్రోహన్ని నిరసిస్తున్నాం, విశాఖ ఉక్కుఫ్యాక్టరీ అమ్మకాన్ని వ్యతిరేకిస్తున్నాం, పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర సరకుల ధరలు తగ్గించాలి, రైతుల పంటకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి తదితర డిమాండ్లతో ప్రచారభేరి యాత్ర జరిగింది. కార్యక్రమంలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్, సిపిఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి పి.యిర్మీయా, సిపిఐ సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి ధరిణికోట విమల, గుంటుపల్లి బాలకృష్ణ, అనుముల ధర్మయ్య, పంతంగి ప్రభాకర్, పురుషోత్తం, జడా రాజ్ కుమార్, యస్.కె.మస్తాన్ వలి, గద్దం సుసులోన్, హరిపోతురాజు, మహేష్, ఎఐటియుసి సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి ఇసిరెడ్డిఅంజిరెడ్డి, బిట్రానాగేశ్వరరావు, నూర్ భాషా సైదులు, దామర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ పరిశీలన

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రధాన కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి వారితో కలిసి నరసరావుపేట సెయింట్ ఆన్స్ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష పేపర్ల మూ ల్యాంకనను(స్పాట్ వాల్యుయేషన్) నిశితంగా పరిశీలించారు. మొత్తం 26 గదులలో 980 మంది ఉపాధ్యాయులతో పదవ తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనను నిర్వహిస్తున్నారు. 26 గదులను పరిశీలించి ఉపాధ్యాయులకు అందిస్తున్న మరుగుదొడ్లు, మంచినీటి వసతి, తదితర మౌలిక వసతులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష పేపర్లను ఉంచుతున్న స్ట్రాంగ్ రూమును పరిశీలించి అక్కడ నిర్వహిస్తున్న రక్షణను అడిగి తెలుసుకుని తగు సూచనలు అందజేశారు. అవసరమైన విధంగా వైద్య సేవలు అందించే విధంగా అంబులెన్స్ కూడా సిద్ధంగా ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి జిల్లా తాళం భజన పోటీలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో బ్రహ్మంగారి 84వ ఆరాధన సందర్భంగా ఈనెల 28 నుండి 30వ తేదీ వరకు తాళం భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వంశ పారంపర్య ధర్మకర్త చింతాడ లలితాంబ మాతాజీ ఆదివారం తెలిపారు. భజన పోటీలలో పాల్గొనదలచిన సమాజములవారు 26వ తేదీలోగా తమ ఎంట్రీలను పంపి పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5000లు, రూ.4000లు, రూ.3000ల రూపాయలను అందించనున్నట్లు ఆమె తెలిపారు. పోటీలలో పాల్గొనే ప్రతి సమాజమునకు రూ.500ల జ్ఞాపిక అందిస్తామన్నారు. భజన పోటీలలో పాల్గొనే సమాజములకు వసతి, భోజన సౌకర్యములు ఆశ్రమములో కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. వివరాలకు భజన పోటీల కార్యనిర్వాహక వర్గ సభ్యులు అయ్యప్ప రామచంద్రరావు 9392320367, చల్లా కృష్ణ రెడ్డి 9000130957, కిల్లంపల్లి ఉమాదేవి 9849770272 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపుదాం

విశాలాంధ్ర-వినుకొండ: ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద "బీజేపీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం" అన్న నినాదంతో బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి నుండి మే 15వ తేదీ వరకు ప్రచార భేరి నిర్వహించాలని సి.పి.ఐ. జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం వినుకొండ టౌన్ 1వ వార్డులో ఇంటింటా సి.పి.ఐ.ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మేము అధికారంలోకి రాగానే ప్రతి పేద కుటుంబానికి 15 లక్షల రూపాయలు వారి బ్యాంకు అకౌంట్లో వేస్తామని, స్విస్ బ్యాంక్‌లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి జీరో అకౌంట్‌ని ఓపెన్ చేసి పేద ప్రజల అకౌంట్లో డబ్బులు వేస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, దగ్గర నుండి వంట గ్యాసు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటే విధంగా తయారు చేశారని, పెరిగిన నిత్యవసర ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ ప్రచార యాత్ర సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ. నాయకులు కొప్పెరపు మల్లికార్జున, సోడాల సాంబయ్య, నల్లబోతుల శీను, తిరుమల రమణ, అక్కమ్మ, సుభాని, బాషా తదితరులు పాల్గొన్నారు...

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

విశాలాంధ్ర-అమరావతి: చర్మకారులకు, చిరు వ్యాపారులు ఎండకు జాగ్రత్తలు తీసుకోవాలని వారికి రక్షణ కల్పించడం కోసము గొడుగులను పంపిణీ చేయటం అభినందనీయమని ఖమ్మంపాడు విలేజ్ రెవెన్యూ అధికారి జైపాల్ అన్నారు. అమరావతిలో ఆదివారం చిరువ్యాపారం చేస్తున్న వారికి, చర్మ కారులకు అభయ ఫౌండేషన్ (హైదరాబాద్) సహకారముతో జన చైతన్య సమితి(పెదకూరపాడు) ఆధ్వర్యంలో గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం ఎండలను సైతం లెక్కచేయకుండా కష్టపడుతున్న వారిని చూసి ఉచితంగా గొడుగులను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ మండుటెండను సైతం లెక్కచేయకుండా జీవనం సాగిస్తున్న రోడ్డు పక్కన పేద చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్న వారికి చేయూతను అందించిన అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్ర స్వామీజీ సేవలు నిరూపమానమన్నారు. జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ మాట్లాడుతూ అతి తీవ్ర ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ రోడ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్న నిరుపేదలకు ఎండ వేడిని తగ్గించడానికి వాళ్లు వడదెబ్బకు గురి కాకుండా వారి ప్రాణాలను కాపాడడానికి గొడుగులు కావాలి అని బాలచంద్ర స్వామీజీని అడిగిన వెంటనే గొడుగులు ఇచ్చారని పేదలకు ఈవిధంగా నైనా సేవ చేసుకునే భాగ్యాన్ని మాకు కల్పించారని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, వాకా ప్రవీణ్ గాలం సాంభశివరావు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

విశాలాంధ్ర-ఈపూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త, భార్యపై కత్తితో దాడి చేసిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరు నందు ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈపూరుకు చెందిన కన్నెబోయిన శ్రీనివాసరావు, భార్య మంగమ్మ ఇరువురు ఆస్తుల విషయంలో గొడవ పడటం, భార్య తనని పట్టించుకోవడం లేదని ఆవేదన చెందిన శ్రీనివాసరావు ఇంట్లో ఉన్న కత్తిని తీసుకొని భార్య మంగమ్మపై దాడి చేశాడు. గాయపడిన మంగమ్మను చికిత్స నిమిత్తం ఈపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై ఈపూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

బ్లడ్ బ్యాంక్ పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బ్లడ్ బ్యాంక్‌ను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కొన్ని నెలల క్రితం ఆలోచన చేయడం జరిగిందని దానికి సంబంధించిన పనులు ఏ స్థాయి వరకు వచ్చాయని బ్లడ్ బ్యాంకును ఎప్పుడు ప్రారంభించవచ్చని నిర్ణయించేందుకు పరిశీలించడం జరిగిందని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న బ్లడ్ బ్యాంక్‌ను చూసిన తర్వాత చాలా ఆనందం కలిగిందని, 400 యూనిట్లు సామర్థ్యం నిలువ ఉన్న బ్లడ్ సెంటర్ అందుబాటులోకి రానున్నదని దీని ద్వారా జిల్లాలో రక్త కొరతను తగ్గించవచ్చునని తెలియజేశారు. ప్రత్యేకంగా రెడ్ క్రాస్ న్యూఢిల్లీ వారు నాలుగు కోట్ల విలువచేసే బ్లడ్ బ్యాంక్ ఎక్విప్మెంట్‌ను అందించడం జరిగిందని అలాగే స్థానికంగా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి వారి కమిటీ సభ్యులు డొనేషన్స్ సేకరించి వాటితో 75శాతం బ్లడ్ బ్యాంక్ యొక్క పనులను పూర్తి చేశారని ఇంకా ఎయిర్ కండిషనర్, ఫ్యాన్స్, జనరేటర్, ఫర్నీచర్, కొంత ఎలక్ట్రికల్ వర్క్ కు సంబంధించిన పనులు పెండింగ్ ఉన్నాయని ఈ పనులు పూర్తి చేయడానికి సుమారు 20 లక్షలు నిధులు అవసరం ఉందని తెలియజేశారు. ఈ బ్లడ్ సెంటర్ యొక్క నిర్మాణం కొరకు స్థానిక శాసన సభ సభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తమవంతు కృషి చేశారని, అలానే రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, లావు కృష్ణదేవరాయలు చెరొక ఐదు లక్షలు మంజూరు చేశారని వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అనంతరం విరాళాలు అందించిన దాతలను సన్మానించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ కంజుల జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ బ్లడ్ బ్యాంక్ కేవలం నరసరావుపేటకి పరిమితం కాదని జిల్లాలో ఉన్న అన్ని మండలాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గంధ్రకోట మురళి కృష్ణ, డి.సి.హెచ్.ఎస్ .రంగారావు, బత్తుల మురళి , కే.ఎం.యస్.వి శ్రీనివాస గుప్తా, వీరారెడ్డి గెల్లి, రహమతుల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు, ఏ.పీ. ఎం.ఐ.డి.సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ధీర అవార్డు అందుకున్న రమేష్ కుమార్

విశాలాంధ్ర-రొంపిచర్ల: ప్రపంచ మేధావి, నవ భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని నెల రోజులు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో తమ పోరాట పటిమతో దళిత బహుజనుల సమస్యలపై ఉద్యమాలు చేపట్టి ఉద్యమ విజయాలను సాధించిన ఉద్యమకారులకు హైద్రాబాద్ లోని అమీర్ పేట్ లోగల రాజ్ గార్డెన్స్‌లో ఆదివారం దళిత బహుజనుల ఉద్యమ ఐక్య వేదిక అధ్యక్షులు చింతా రాజనర్సింహులు ఆధ్వర్యంలో దళిత బహుజనుల సమస్యలపై, దళిత బహుజనుల మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై ఉద్యమాలు చేపట్టి ఉద్యమ విజయాలను అందుకున్న ఉద్యమ వీరులకు ఉద్యమ ధీర అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ దర్శకులు, సినీ నిర్మాత, సినీ నటులు ఆర్.నారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దృశ్య కళల చైర్మన్ కుడుపూడి సత్యశైలజ, అంబేద్కర్ యువజన సంఘనాయకులు ఈశ్వరయ్య, అంబేద్కర్ నాట్యమండలి అధ్యక్షులు ప్రసాద్, దళిత ఉద్యమ నేత నగేష్, హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుండి పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులోని అంబేద్కర్ నగర్ కు చెందిన దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్‌కు ఈ సంధర్భంగా జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సినీ నటులు ఆర్.నారాయణ మూర్తి చేతుల మీదుగా డాక్టర్ గోదా రమేష్ కుమార్ ఉద్యమ ధీర అవార్డును అందుకున్నారు.

మండలంలో ప్రచారభేరి

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో అన్ని గ్రామాల్లో ఆదివారం సిపిఐ, సిపియం ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమం జరిగింది. మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల, మాచవరం, వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి, మునమాక గ్రామాలలో ప్రచారభేరి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ, సిపియం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమును సాగనంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, నరసరావుపేట పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, మండల నాయకులు పిడెం హుస్సేన్, హర్ష, సిపియం పల్నాడు జిల్లా నాయకులు పెద్దిరాజు, కొమ్ముల నాగేశ్వరరావు, ఇజ్రాయిల్, సిఐటియు మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి విద్యుత్ సరఫరా నిలిపివేయటం వలన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురవటం వలన మండలంలో పలుగ్రామాలలో గల చెట్లు పడిపోయి రోడ్డుకు అడ్డంగా ఉండటం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులుకు గ్రామాలలో ఇంటి పై రేకులు లేచిపోయాయి. మండల కేంద్రమైన రొంపిచర్ల శివాలయం కాలనీ లో గల ముక్కదాల నాగేశ్వరరావు కు చెందిన ఇంటి పైకప్పు రేకులు చెల్లాచెదురుగా దూరంగా పొలాల్లో పడిపోయాయి. ఇంటిలో ప్యాన్లు కూడా విరిగి పోయాయి. ఇంటిలో సామాన్లు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈదురు గాలులు వలన తమ ఇల్లు దెబ్బతిని లక్షరూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు నాగేశ్వరరావు తెలిపారు. తాము ప్రాణాలతో బయటపడ్డామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ వర్షమునకు కళ్ళాల్లో ఆరబోసిన మొక్కజొన్న, మిర్చి పంటలు తడవకుండా వాటిపై పరదాలు కప్పారు. మండలంలో ఈదురు గాలులతో తోడు వడగండ్ల వర్షం కురిసింది.

ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల కేంద్రమైన పెద కూరపాడులో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయములో వేద బ్రాహ్మణులు సుబ్రహ్మణ్యం శాస్త్రి పాల్గొని భక్తులచే కుంకుమ పూజలు లలితా సహస్రనామం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు , తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్‌గా ముండ్ల జాన్

విశాలాంధ్ర - బాపట్ల : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) బాపట్ల జిల్లా కన్వీనర్‌గా ముండ్ల జాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ముండ్ల జాన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాసర్‌జీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో పోరాటాలు చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్‌ను బలోపేతం చేయాలని కోరారు.

అమ్మవారి జయంతి సందర్భంగా 28న పూజ కార్యక్రమాలు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలులో వేంచేసియున్న శ్రీ బగలాముఖి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 28వ తేదీన శ్రీ బగలాముఖి జయంతి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా 108 కలశాలతో 250 లీటర్ల ఆవుపాలతో అమ్మవారికి అభిషేకం జరిపి విశేష అలంకారము, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.కావున భక్తులు అందరూ ఈ నెల 28వ తేదీన జరిగే అమ్మవారి జయంతి కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు కోరారు.

భగలాముఖి అమ్మవార్ని దర్శించుకున్న జేసీ

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలులో వేంచేసియున్న శ్రీ భగలాముఖి అమ్మవారిని ఆదివారం ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కుటుంబ సమేతంగా సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.వారికి ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి అమ్మవారి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జీ.నరసింహమూర్తి ఉన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

విశాలాంధ్ర - చీరాల : కమనీయం కళ్యాణం. చీరాల పట్టణంలోని సంతబజారులో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వాసవి మాత జన్మదినోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శ్రీ వెంకటేశ్వర స్వామి గానామృత కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణమూర్తులు విశేషంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కళ్యాణంలో వివిధ రకాల స్వీట్లు,పండ్లు,పూలను భక్తులు దేవతామూర్తులకు సమర్పించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు కమిటీ ప్రతినిధులు ప్రసాదం అందజేశారు.

పిడుగుపాటుకు రెండెకరాల వరికుప్ప దగ్ధం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మండలంలోని గోపాపురం పంట పొలాల్లో వరికుప్పపై ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో అకస్మాత్తుగా పిడుగు పడింది. ఈ దుర్ఘటనలో పుండ్ల గ్రామానికి చెందిన సాగిన వేణుకు చెందిన రెండు ఎకరాల వరికుప్ప పూర్తిగా దగ్ధమైంది. ఆరుగాలం పండించిన కుప్ప వేసుకుని నూర్చి ఇంటికి తీసుకువెళదాం అనుకున్న తరుణంలో పిడుగుపాటుకు రెండు ఎకరాల వరికుప్ప పూర్తిగా దగ్ధం అవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరవుతున్నారు. మంటలను ఆర్పేందుకు రెండు గ్రామాల ప్రజలు ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి రైతును ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వీధి కుక్కల నుంచి రక్షించండి మహాప్రభో..

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలో ఉన్న 34 వార్డులలో వీధి కుక్కల స్వైరా విహారంతో పట్టణ వాసులు బెంబేలెత్తుతున్నారు.

విజయ లక్ష్మి పురంలోని పలురోడ్లలో వీధి కుక్కలు స్వైర విహారం చేయడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత కొంత కాలంగా కుక్కలపై పురపాలక సంఘం వారు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వీధి కుక్కల సంఖ్య తీవ్రంగా పెరిగిందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. కుక్కల దాడి వలన గాయాల పాలైన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటేనే భయభ్రాంతులకు గురవు తున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పురపాలక సంఘ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి కుక్కల నుండి తమకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అకాల వర్షంతో రైతులకు ఇబ్బందులు

విశాలాంధ్ర - బల్లికురవ : ఆరుగాలాలు కష్టపడి పండించిన పంటలు అకాల వర్షాలు రైతన్నలకు కన్నీరు మిగుల్చుతున్నాయి. పంట నూర్పిడి చేసిన మొక్కజొన్న,మిరప కల్లాలలో ఆరబెట్టగా ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో వడగళ్ల వాన కురవడంతో కళ్ళలో ఆరబెట్టిన మొక్కజొన్న మిరప పూర్తిగా తడిసిపోయాయి. మండల పరిధిలో నక్కబొక్కలపాడు, కొనిదెన, కొప్పరపాలెం, మల్లయ్యపాలెం, బల్లికురవ,గుంటుపల్లి, అంబడిపూడి, చెన్నుపల్లి, కొమ్మినేనివారిపాలెం తదితర గ్రామాలలో మిరప,మొక్కజొన్న పైర్లు అధికంగా సాగు చేశారు.ఈ ఏడాది వాతావరణం అనుకూలించి సకాలంలో వర్షాల పడి పంటలు బాగా పండాయి అధిక దిగుబడులు వస్తాయి అన్న ఆనందం గత నెలలో కురిసిన అకాల వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతింది.ఆదివారం కురిసిన వర్షానికి కళ్ళల్లో ఆరబెట్టిన మొక్కజొన్న మిర్చి పూర్తిగా తడిసిపోయాయి.

జిల్లా 108 ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-అద్దంకి : బాపట్ల జిల్లా 108 అంబులెన్స్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం బాపట్లలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షులు నార్ల మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కార్యదర్శిగా పిల్లిమెట్ల హరిబాబు, కోశాధికారిగా కో,కోటయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో విభజిత బాపట్ల జిల్లాలోని అన్ని మండలాల నుంచి 108 సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మృతితో ఐలవరంలో విషాదఛాయలు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి మృతి చెందడంతో మండలంలోని ఐలవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జొన్నాదుల గణేష్ (14) తన తండ్రితో కలిసి ద్విచక్రవాహనంపై శనివారం మంగళగిరి నుంచి ఐలవరం వస్తుండగా తెనాలి వద్ద ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో గణేష్ తలకు తీవ్ర గాయమైంది. గుంటూరులో చికిత్స పొందుతూ గణేష్ ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఐలవరం తీసుకురావడంతో ఒక్కసారిగా తల్లి, తండ్రి, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు.

వైభవంగా దొంతిబోయిన ప్రమాణస్వీకారోత్సవం..

- హాజరైన మంత్రులు మేరుగ,కాకాని
- కొలువుదీరిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం
- అన్నీ వర్గాలకు సముచిత స్థానం, 50 శాతం మహిళలకు : కోన

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దొంతిబోయిన సీతారామిరెడ్డి ప్రమాణ స్వీకారం ఆదివారం వైభవంగా జరిగింది. స్వగ్రామం కర్లపాలెం మండలం నుంచి ద్విచక్రవాహనాలు, కార్లతో భారీ ర్యాలీగా గ్రామ దేవత స్థానిక పెద్దింటమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్లపాలెం ఐలాండ్ సెంటర్ నుంచి సీతారామిరెడ్డి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులతో భారీ ర్యాలీగా బాపట్ల మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకార మహోత్సవంలో మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాస్ కమిటీ చైర్మన్‌గా దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్ చైర్మన్‌గా పిన్నిబోయిన ప్రసాద్‌తో పాటు 20 మంది డైరెక్టర్లచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయానికి అండగా నిలవాల్సిన వ్యవస్థ మార్కెట్ యార్డు అని రైతులకు పాలకవర్గం ఎల్లప్పుడూ అండగా ఉండాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎంతైనా కొనుగోలు చేసేందుకు సన్నద్ధంగా ఉందన్నారు. రైతు నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసే ప్రతి గింజకు నష్టం లేకుండా చూస్తామన్నారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో 20 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు అమోదం తెలుపుతున్నామని ఇంకా రైతుల దగ్గర ధాన్యం ఉంటే కొనుగోలు చేసేందుకు వెనకాడబోమని తెలిపారు. రైతు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశయంతో వైసీపీ ప్రభుత్వం అన్నదాతలకు పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్రంలో దళారీ, వ్యాపారి, అమ్మకందారుడు దగ్గర నుంచి వినియోగదారుడు కొనుగోలు చేసే ధర చూస్తే రైతుకు ఎంత మేర నష్టం వస్తుందో అర్థమవుతుందన్నారు. దళారీల వ్యవస్థకు అడ్డుకట్ట వేసేందుకు రైతు నేరుగా ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చి ధర పొందేందుకు ముఖ్య మంత్రి రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం ఆన్లైన్ ట్రేడింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చామని రైతులు నేరుగా విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. 68 శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారని రైతుకు ఏ మాత్రం నష్టం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు ఎంతో అన్యాయం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సబ్సిడీపై యంత్రాలు రైతులకే నేరుగా ఇస్తున్నామని పంటలభీమ మొత్తం ప్రభుత్వమే చెలిస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాన్ని అనుసంధానం చేసుకొని మార్కెట్ యార్డులు గోదాములు, కోల్‌స్టోరేజిల నిర్మాణానికి కృషి. చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రైతు బాగు కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని అగ్రభాగాన నిలిపి రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం పట్ల ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి ఎంత పట్టుదల ఉందో ఆవిధంగా దానిని నడిపిస్తున్న ఘనత మంత్రి గోవర్ధనరెడ్డికి దక్కుతుందన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధర అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం బాగుంటేనే అన్నిప్రాంతాలు బాగుంటాయని పంట దళారుల చేతిలోకి వెళ్ళకుండా రైతులకు ఆర్బికేల ద్వారా మేలు చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ పాలకమండలిలో అన్నివర్గాల వారికి ప్రాధాన్యతనిస్తూ 50శాతం మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. చరిత్ర కలిగిన బాపట్ల మార్కెట్ యార్డుకు రెవెన్యూశాఖలో

పనిచేసిన దొంతిబోయన సీతారామిరెడ్డి చైర్మన్ కావటం సంతోషదాయకమన్నారు. అనంతరం చైర్మన్ సీతారామిరెడ్డిని, పాలక వర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ, ఎంపిపిలు చినపోతులు హరి బాబు, షేక్ బాజీ, జడ్పీటీసీలు పిన్నిబోయన ఎస్తేరు రాణి, పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, బాపట్ల మండలపార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, కార్పోరేషన్ డైరెక్టర్లు గొర్రెముచ్చు పుష్పరాజ్యం, వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీసెల్ నాయకులు పడ్డిముక్కల డేవిడ్, చల్లా రామయ్య, మాల్యాద్రి, ఆర్డీవో గంధం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్‌జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) బాపట్ల జిల్లా ముఖ్య నాయకుల సమావేశం పట్టణంలో సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నాసర్‌జీ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్య పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షల రూపాయలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ఇంటర్మీడియట్ బోర్డు రూల్స్ పాటించకుండా అనుమతులు లేని భవనాలలో కళాశాలలను పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. వేసవి సెలవులలో కూడా కళాశాల నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు. విద్యా సంస్థల యాజమాన్యం ఒత్తిడికి గురై విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు రాష్ట్రంలో చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే అధికారులు విద్యాసంస్థలను తనిఖీ చేసి అనుమతులు లేని భవనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ముండ్ల జాన్, బొజ్జా ఎబేలు, గర్నీపూడి వివేక్, బాబ్జి, గడ్డం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్ కల్పించాలి

విశాలాంధ్ర - చీరాల : దేశంలో అగ్రభాగంగా ఉన్న బీసీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీల ఓటు బ్యాంకుతో గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే రానున్న ఎన్నికలలో గుణపాఠం తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లుకా వెంగళరావు అన్నారు. చీరాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం రోడ్‌లో కేకే కాంప్లెక్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జాతీయ బీసి సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ బీసీలందరు ఐక్యంగా కూర్చుని వివిధ సమస్యలపై చర్చించుకునేందుకు చీరాలలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయం చాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రైవేటు,పరిశ్రమ,న్యాయస్థానాలు వంటి వివిధ రంగాలలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని,ఆంధ్రప్రదేశ్‌లో కూడా రానున్న ఎన్నికలలో 70 అసెంబ్లీ 10 పార్లమెంట్ సీట్లను ఆయా రాజకీయ పార్టీలు బీసీలకు విధిగా కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ నరసింహారావు, జిల్లా అధ్యక్షులు రమేష్, నారాయణ, శివ పార్వతి, అశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సంకల్పబలంతో ఏలూరి ప్రజాసేవ

విశాలాంధ్ర - మార్టూరు : ప్రజాసేవ చేయాలనే సంకల్ప బలంతోనే ఎమ్మెల్యే ఏలూరి రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు కార్యనిర్వహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పొద వీరయ్య ఆజాద్‌లు అన్నారు. ఆదివారం పెద్దగంజాం గ్రామంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రీ గ్రూప్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా నిరంతరం ఉచితంగా కంటి వైద్య శిబిరాలు, మోకాళ్ళ ఆపరేషన్లు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఎమ్మెల్యే ఏలూరి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు వడ్లమూడి వెంకయ్య, ఆసోది బ్రహ్మానంద రెడ్డి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ మత్స్యకార శాఖ కార్యనిర్వహణ కార్యదర్శి గొల్లబోతు వెంకటేశ్వర్లు, నోవా వైస్ ప్రెసిడెంట్ అజయ్ బాబు నాయకులు హరిబాబు, చిన్నగంజాం సర్పంచ్ రాయిని ఆత్మ రావు, టీడీపీ ప్రెసిడెంట్ చెరుకూరి రాఘవయ్య, సందు శ్రీనివాసరావు, నరహరి శ్రీనివాసరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-పర్చూరు: ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములు కావాలని రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు తెలిపారు. పోతినవారిపాలెంలోని పంచాయతీ కార్యాలయంలో ఆదివారం రోటరీ ఆధ్వర్యంలో గడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, గ్రామ సర్పంచ్ పోతిన శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు కోమటి ఆంజనేయులు, కొల్లా నాగబాబు, గ్రామస్థులు ఉన్నారు.

పిడుగు పడి గేదెలు మృతి

విశాలాంధ్ర - అద్దంకి : పిడుగు పడి గేదెలు మృతి చెందిన సంఘన మండలంలోని చక్రాయపాలెంలో ఆదివారం జరిగింది.ఆదివారం సాయంత్రం చక్రాయపాలెం గ్రామానికి చెందిన చెన్నుబోయిన గుమ్మడి నరసిహరావుకు చెందిన 2 గేదెలు పొలంలో మేత మెస్తుండగా వాటిపై పిడుగు పడి గేదెలు మృత్యువాతకు గురయ్యాయి.

అభివృద్ధి అంటే మురుగునీరు సరఫరా చేయటమా..?

– సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న నాయకులు, అధికారులు పట్టణ ప్రజలకు తాగునీరు మురుగు కలిపి సరఫరా చేయటమా అని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ప్రశ్నించారు. పట్టణంలో ఆదివారం అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణం, తాగునీరు లేకేజై కలుషితమవుతున్న ప్రదేశాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరకొండ మాట్లాడుతూ బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా పట్టణంలో పండుగ వాతావరణంలో అధికారులు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున సంబరాలు ఏర్పాటు చేశారన్నారు. బాపట్ల మున్సిపాలిటీలో అభివృద్ధి పేరుతో రోడ్లు ఏర్పాటు చేసే క్రమంలో మున్సిపాలిటీ డ్రైనేజీ సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో పాటు తాగునీటి పైపులైన్లు అసంపూర్తిగా ఉండటం వల్ల తాగునీరు, మురుగునీరు కలిసిపోతున్నాయని వాటినే ప్రజలకు సరఫరా చేస్తున్నారని బాపట్ల మున్సిపాలిటీ అధికారులు తాగునీరు మురుగునీరు కలయిక అనే కొత్త పథకానికి నాంది పలికారన్నారు. దీని వలన ప్రజలకు అంటు రోగాలు వ్యాపి చెందుతున్నాయన్నారు. సీపీఐ జిల్లా నాయకులు జెల్ది భాగ్య శ్రీధర్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ 34 వార్డులకు సప్లై చేస్తున్న మురుగునీరు, తాగునీరు కలిపి పంపిణీ చేస్తున్న నీటిని నిలుపుదల చేయాలని అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు పర్యవేక్షణ లోపాన్ని కప్పిపుచ్చుకుంటూ కాంట్రాక్టర్‌పై నెపాన్ని మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మామిడి బత్తుల అశోక్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన మొక్కజొన్న

విశాలాంధ్ర - బల్లికురవ : ఆరు కాలాలు కష్టపడి పండించిన పంట చేతికందివచ్చిన సమయంలో అగ్నికి ఆహుతోవడంతో రైతన్న లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని అంబడిపూడి గ్రామంలో సుమారు 20 ఎకరాల మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయిన ఘటన చోటు చేసుకుంది.ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వీచిన ఈదురు గాలులకు విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు లేచి మొక్కజొన్న పైరుకు అంటుకున్నాయి.ఎండకు పైరు బాగా ఎండి ఉండటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.వెంటనే కొందరు చుట్టుపక్కల ఉన్న కొందరు రైతులు గ్రామస్తులకి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.గాలులు ఎక్కువగా వీస్తుండటంతో పైరు అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికి పూర్తిగా పంట కాలి బూడిదయ్యింది.అగ్నికి ఆహుతి అయిన మొక్కజొన్న పైరు విలువ సుమారు రూ.20 లక్షల వరకు నష్టం ఉంటుంది రైతులు వాపోతున్నారు.పంట నష్టపోయిన రైతులు వివరాలు అర్వపల్లి శ్రీనివాసరావు, గంగవరపు అనీల్,గంగవరపు హనుమంతరావు,హరిబాబు,శేషయ్య,చంద్రమౌళి మరియు కొందరు రైతులకు చెందిన మొక్కజొన్న పంట దద్దమైనట్లుగా తెలుస్తుంది.గత నెలలో కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న పూర్తిగా నెలకు ఒరిగిపోయింది.ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాలకు రైతన్న నష్టాలు ఊబిలో కూరుకుపోతున్నారు.

మజ్జిగ, తాగునీరు వితరణ

విశాలాంధ్ర-అద్దంకి : సింగరకొండ వద్ద గల డా.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులకు, వారికి తోడుగా వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ వారు వేసవి దృష్ట్యా మంచినీరు. మజ్జిగను వితరణ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు,కార్యదర్శి చిన్ని మురళీకృష్ణ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని ఏబీఎం హైస్కూల్‌లో 1976- 77 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 38 సంవత్సరాల తర్వాత ఒకరినొకరూ చూసుకుంటూ ఆపాయ్యంగా ఆనందంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. నాడు తమకు పాఠాలు నేర్పించిన గురువులు ఎలీషా బాబును పూలమాలతో, దృశాలువాతో పూర్వ విద్యార్థుల ఉప్పల నాగేశ్వరరావు, ఏడుకొండలు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారి జీవితాల్లోని సుఖ సంతోషాలను ఒకరిని ఒకరు తెలుసుకొని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. అదేవిధంగా తమ జీవితాలలో విద్యా ప్రమాణాలు ఏ విధంగా దోహదపడ్డాయో వివరిస్తూ వారి వారి కుటుంబ బాంధవ్యాల ప్రేమానుబంధాలను పరిచయం చేసుకుంటూ అప్పుడే సమయం అయిపోయిందా అన్నంతగా ఈ ఆత్మీయ కలయిక చోటు చేసుకుందని పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినిలు విజయకుమారి, రాధరాణి, అంజనాదేవి, పంచాక్షరి, విజయలక్ష్మి, విద్యార్థులు హర్షవర్ధన్, ఈమని కోటి, రఘురాం, వేణు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు.. రైతుల ఉరుకుపరుగులు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు అన్నదాతలను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఆకాశం నీలిమేఘాలు కమ్ముకుని చల్లటి గాలులతో కూడిన చిరుజల్లులు పడుతుండడంతో మొక్కజొన్న రైతాంగం పట్టాలు తీసుకుని పంట పొలాలవైపు పరుగులు తీశారు. వర్షాలు కురిస్తే పంట భూముల్లోని కల్లాల్లో కుప్పల రూపంలో ఉన్న మొక్కజొన్న తడిస్తే నాణ్యత తగ్గి ధర పడిపోతుందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులను సైతం నష్ట పోవాల్సివస్తుందంటున్నారు. రైతాంగం రబీ సీజన్‌లో మండలంలో అత్యధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. రైతాంగం గింజపాలు పోసుకునే దశలో కురిసిన అకాల వర్షాల కారణంగా గింజ తాలుగా మారిందని దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. గత 10 రోజులుగా మొక్కజొన్న పంట కోతలు ఊపందుకున్నాయి. పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట కండెల రూపంలో ఉండగా పలు గ్రామాల్లో మొక్కజొన్న గింజల రూపంలో ఉన్నది. ప్రస్తుతం నెలకొన్న వాతావరణంలో మార్పులతో కోత కోసిన పంటను పట్టాలు కప్పుతుండగా గింజలను బస్తాల్లోకి చేర్చి ఇళ్ళకు చేర్చుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చేస్తున్న హెచ్చరికలు మొక్కజొన్న , తెల్లజొన్న రైతాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

భరత మాత ముద్దుబిడ్డల విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - భట్టిప్రోలు : భావితరాలకు ఆదర్శంగా నిలిచిన భరతమాత ముద్దుబిడ్డల విగ్రహాలను ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహ సాధన కమిటీ సభ్యులు అభినందనీయులని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. మండల కేంద్రమైన భట్టిప్రోలు బౌద్ధస్థూపం ఎదురుగా ఏర్పాటు చేసిన భరతమాత ముద్దుబిడ్డల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములైన స్ఫూర్తి ప్రదాతలు స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, సుభాష్‌చంద్రబోస్, శ్రీకృష్ణదేవరాయలు, ఘంటసాల వెంకటేశ్వరరావుల విగ్రహాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన రావడం శుభపరిణామమన్నారు. గౌతమ బుద్ధుని ధాతువులపై నిర్మితమైన పవిత్ర బౌద్ధస్తూపం ఎదురుగా స్ఫూర్తి ప్రదాతల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం మంచి నిర్ణయమన్నారు.

ప్రభుత్వ భూమిపై రియల్టర్ల కన్ను

- ప్లాట్లు వేసి విక్రయంచేందుకు ఏర్పాట్లు
- అడ్డుకున్న కాలనీ వాసులు, విచారించాలని డిమాండ్

విశాలాంధ్ర - రేపల్లె : భూమి లేని నిరుపేదలకు భూములు ఇచ్చేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్న, ప్రభుత్వ భూములు కబ్జాకు గురి అవుతునే ఉన్నాయి. ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు ఫేక్ పట్టాలను సృష్టించి కొందరు స్వార్థపరులు ఆక్రమణలకు రంగం సిద్ధం చేశారు. మండలంలోని పెటేరు గ్రామ పంచాయతీ పరిధిలో రేపల్లె నుండి పెటేరు వెళ్ళు ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి కాలనీలో కమ్యూనిటీ స్థలాన్ని అధికార పార్టీ పేరు అడ్డం పెట్టుకుని కొందరు రియల్టర్ల్ ఆక్రమించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జేసీబీ సాయంతో మట్టిని సరిచేస్తున్న ఆక్రమణ దారులను స్థానిక కాలనీ వాసులు అడ్డుకున్నారు. కమ్యూనిటీ భూమి ఆక్రమణకు గురి అవుతుందని, రెవిన్యూ అధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్థానికుల ఇచ్చిన సమాచారం ప్రకారం ఆర్ సి నెంబర్ 1378/98/ఏ, లేఅవుట్ నెంబర్ 123/2 ప్రకారం 2003 మే నెలలో అప్పటి తహసీల్దార్ మేడికొండ ప్రభాకర రావు 136 మంది పేదలకు నివేశన స్థలాలకు పట్టాలను మంజూరు చేశారని తెలిపారు. స్థలం మిగిలి ఉండటంతో మరో 30 సెంట్ల స్థలాన్ని విద్యుత్ సబ్ స్టేషన్ కు కేటాయిన్ చారని తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ కు దక్షిణాన ఉన్న సుమారు 13 సెంట్ల స్థలాన్ని కమ్యూనిటీ సైటుగా నిర్ణయించి అక్కడ అంగన్వాడీ స్కూల్ నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారని తెలిపారు. అయితే గత ప్రభుత్వంలో ఇక్కడ వాటర్ ట్యాంక్ నిర్మాణాలు చేపట్టాలని బోర్లు వేయగా నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రక్కనే కొద్ది దూరంలో ఉన్న ఆలపాటి నగర్ లో ట్యాంకలను నిర్మించారన్నారు. అప్పటి నుండి ఈ భూమిపై కన్ను వేసిన రియల్టర్ల్ స్వాధీనం చేసుకునెందుకు ప్రయత్నాలు చేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అయితే 2012 - 2013 సంవత్సరాలలో ఈ భూమికి పట్టా పొందామని సదరు రియల్టర్లు పట్టాలను చూపిస్తున్నారని చెప్పారు. నల్లమోతు శివ నాగరాజు, మరో మహిళ పేరుతో ఉన్న నివేశన స్థలం పట్టాలను రెవిన్యూ అధికారులు ఇచ్చారని ఆక్రమణ దారులు పట్టాలను చూపిస్తున్నారని, అవి ఫేక్ పట్టాలని తెలిపారు. వాటిని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించి సొమ్ము చేసుకోవాలని రియల్టర్లు అక్కడ మట్టి తొలుతున్నారని ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం 2012 లో నివేశన స్థలానికి పట్టా ఇస్తే రెండు సెంట్లు వరకు ఇద్దరికి ఇస్తే , నాలుగు సెంట్లు పోను ఇంకా 9 సెంట్ల స్థలం ఉండాలని కాలనీ వాసులు చెప్పారు. రాజకీయ నాయకుల పేర్లు చెప్పుకుంటూ కొందరు స్వార్థపరులు ప్రభుత్వ భూమిని అక్రమించుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వం భూమి ఆక్రమణకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.